

# కూటికి పేదైనా కులానికి నవాబునా?

యీ కతలో మాత్రం ముందు యిప్పటి సంగతి చెప్పి ఆనేక నా చిన్నప్పటి సంగతి చెప్తానబ్బా!

మొన్నామద్య జూలై నెలలో సెలవు పెట్టి, మా కావలికెళ్లి ఆరాంగా యింట్లో కూచొని కాంతమ్మ దోసెలు తింటా వుంటే 'మెహమూదా అక్క' వచ్చింది, 'ఏమి నాయినా ఎప్పుడొచ్చినావా?' అని పలకరిస్తా.

'నిన్ననే అకా. దా. కూచో' అన్నాను అబిమానంగా నవ్వతా.

'నాష్టా చేసినావా అకా' అన్నాను మళ్లా.

'చేసినాను నాయినా.నువుకానీ' అంటా గాద్రేజు కుర్చీలో కూచునింది మెహమూదా అక్క.

యింతలోపల మా అమ్మ వచ్చింది. 'మెహమూదాకు నీతో పనుందంట అబయా. ఎప్పుడొస్తావా అని కాచుకోనుంది. అదేదో రొంత చేసి పెట్టరాదా?' అనింది, రెకమండేషను

చేస్తా.

'అయ్యో... ఆ మాత్రానికే మా అమ్మొచ్చి చెప్పాలంటకా. నువు చెబితే చాలదా. ఏం పనో చెప్పకా' అన్నాను, నిజ్జంగానే ఆమె ఏమి పని చెప్పినా ఎప్మటైన్నే వెళ్లి చేసుకొని వచ్చేద్దామన్నంతగా.

నా మాటకి మెహమూదా అక్క సమాదానం చెప్పకుండా 'రే... హాజీ' అంటా, మా వాకిలి తట్టు చూసి కేకేసింది. అంతదాకా బయిటే కాసుకోనున్న హాజీగాడు నా తట్టు బిడియంగా చూస్తా వాళ్లమ్మ పక్కనొచ్చి నిలబడినాడు.

'వీడు యీ సమచ్చరం టెన్తు సెకండ్ కిలాసులో పాసయినాడు నాయినా. కాలేజీలో వందలు వందలు కట్టి చదివించడానికి మనకాడ డబ్బుల్లేవు, ఏదైనా పనిలో చేరిపో అని చెబితే చదవతానంటే చదవతానని పట్టుపడతా వున్నాడు. నా వల్ల యాడవద్దీ? అదేదో దూదేకుల సర్టిఫికేటు తెచ్చుకుంటే ఫీజులు తగ్గతాయని దానికి ట్రై చేసినాము. ఎమ్మార్వో ఆపీసులో ఆ సర్టిపికేటు యివ్వాలంటే కరణం కాణ్ణుంచి కాయితం తెచ్చుకోవాలంట. నీకు పుణ్యముంటుంది. ఆ కాయితం యిప్పీ నాయినా' అనిందామె, హాజీగాడి బుజం మీద చెయ్యేసి దగ్గరకు తీసుకుంటా.

ఆ మాటలకి మనసు కలుక్కుమని, ఎట్టాంటి వాళ్లకి ఎట్టాంటి రాత రాసినావురా తండ్రీ అనుకుంటా 'అదెంత పనకా. వాణ్ణి యీడే వదిలి నువు యింటికిపో. మేమిద్దరం పోయేసి ఆ కాయితమేదో తీసకొచ్చి పెడతాము' అన్నాను.

దోసెలు తినేసినాక హాజీగాణ్ణి తీసుకొని సైకిలు మీద బయలుదేరినానుగానీ నా మనసు మనసులో లేదు. ఒకప్పుడు నవాబుల్లాగా బతికిన మెహమూదా అక్కోళ్లు యివాళ యీ గతికొచ్చినారేమిరా అని బలే కష్టంగా అనిపించింది.

మెహమూదా అక్కోళ్లు మా నాయినకు దూరపు బందువులు. మెహమూదా అక్కోళ్ల నాయినకు ఒకప్పుడు చాలా ఆస్తులు వుండేవిగానీ సంసారం పెద్దదయ్యే సరికి అయన్నీ కరిగిపోయి, చివరకి మెహెమూదా అక్కని 'డాన్ టైలర్స్'కు యిచ్చి చేయాల్సొచ్చింది.

డాన్ టైలర్స్ అసలు పేరు మాగ్గానీ మా వూళ్లో చాలా మందికిగానీ తెలియనే తెలియదు. ఆయన్ని అందరం ఆయన టైలరింగు షాపు పేరుతోనే పిలిచేవాళ్లం. (డాన్ సినిమా రిలీజయిన కొత్తల్లో ముచ్చటపడి ఆయన ఆ పేరు పెట్టుకున్నాడంట).

డాన్ టైలర్స్ సామాన్యుడు కాదు. మిషను జోలికే పోకుండా చేతికుట్టుతోనే ప్యాంట్లు కుట్టి మా వూరోళ్లని నోళ్లు తెరుచుకునేలా చేసిన జగజ్జంత్రి. ఆయన పనితనం చూసి

ఫ్యాషనంటే డాన్ టైలర్స్‌దేనని, ప్యాంటు కుడితే డాన్ టైలరే కుట్టాలని మా వూళ్లో ఎచ్చులపుడుంగులంతా డాన్ టైలర్ కోసరం విరగబడితే ఆయన చేసే పనేందో తెలుసునా? అడ్వాన్సు డబ్బులతో తాగడం. వాళ్లనీ వీళ్లని కూచోపెట్టి తాపించడం.

'ముగ్గురు బిడ్డలు వున్నారు. వాళ్ల మొకాలైనా చూసి మానరా సామీ' అని మెహమూదా అక్క ఎంత చెప్పినా డాన్ టైలర్స్ దారికి రాలా. పొగులు పూటంతా మెహమూదా అక్కతో మరేదగా నవ్వతా వుండేవాడుకానీ సాయింత్రం గుక్క నోట్లో పడంగానే ఎత్తుకునేవాడు కర్ర. ఆయన చేతిలో తన్నులు తింటా, ముగ్గురు బిడ్డలతో బాదలు పడతా నానా సావు సస్తా ఉండేది మెహమూదా అక్క.

రాను రాను డాన్ టైలర్స్ ఆగడాలు అలివికాకుండాపోయి మెహమూదా అక్క సావడానికి రెడీగా వుందని తెలిసినాక నెల్లూరు నుంచి ఆమె అన్నయ్యలు దిగి పెద్ద గలాటా చేసినారు.

'తాగుడు మాని సక్కరంగా కాపరం చేసినావో సరేసరి. లాకుంటే మిషను తొక్కేదానికి లాకుండా కాళ్లిరగ కొడతాము' అని బెదిరించి, బతిమిలాడి వెళ్లినారు.

ఇది జరిగినాక డాన్ టైలర్స్ అదుపులోనే వుండినాడుగానీ మళ్లా గుబులు తిరిగి మెహమూదా అక్కతో తకరారు పెట్టుకున్నాడు. ఆ తకరారు పెరిగి పెద్దదయ్యే సరికి యింకేమనుకున్నాడో ఏమో అదే రోజు అలిగి, ఎటో వెళ్లిపోయినాడు.

అంతే. యివ్వాళ్టికి పన్నెండేళ్లవతావున్నా తిరిగిరాలా. యాడున్నాడో కూడా ఎవురికీ తెలీలా. పాపం ఆరోజు నుంచి యీరోజు దాక మెహమూదా అక్క ఎన్ని బాదలు పడిందో ఎన్ని కష్టాలపడి బిడ్డల్ని సాక్కుందో పైనున్న ఆ పరమాత్ముడికి తెలుసు. కింద మెహమూదా అక్కకి తెలుసు.

మెహమూదా అక్క బలే ఆత్మాబిమానం గల మనిషి. బర్త లాకపోయినా ఒక్కరోజు కూడా బంధువుల పంచనగానీ, అన్నల పంచనగానీ చేరలా. ఆస్పత్రిలో అటెండరుగా చేస్తా ఆ వచ్చిన డబ్బులతోటే ఎట్నో యింటిని నెట్టుకొచ్చేదిగానీ ఏనాడూ ఎవుర్నీ చేయిచాపి రూపాయి అడిగేది కాదు. మా యింటికొచ్చి మమ్మల్ని ఏదన్నా అడగడం కూడా యిదే పస్టుసారి.

అందుకనే ఎట్టాగయినా చేసి హాజీగాడికి (మొదటి యిద్దరు మొగపిలకాయలు చదువు మానేసి పనుల్లో చేరిపోయినారు. హాజీగాడు ఆఖరోడు) దూదేకుల సర్టిఫికేటు యిప్పించాలని మా అమ్మకు దూరపు బంధువైన కరణం సాలేహా యింటికి పోయినాను.

సాలేహా కొడుకు నాకు పరిచయమే. యిప్పుడు కాయితాలిచ్చే పని కూడా సాలేహా కొడుకే

చూస్తా వున్నాడు. నేను అతణ్ణి యింటిలో నుంచి బయిటికి పిలచక వచ్చి, హాజీని చూపిస్తా యిట్టిట్టా సంగతీ 'యీ పిల్లోడు చాలా బీదోడు. తండ్రి లేని బిడ్డ. నువ్వు ఎట్టాగయినా చేసి వీడికి దూదేకుల సర్టిఫికేటు యిప్పించినావంటే నాలుగు ముక్కలు చదువుకొని ఎట్నో బతుక్కునేస్తాడు' అన్నాను.

నా మాటలు పూర్తి కాక ముందరే, యింకేమి మాట్లాడబాక అన్నట్టుగా చెయ్యడ్డం పెట్టి, లోపలికి పిలచకపోయినాడు సాలేహా కొడుకు.

అతను కూచునే టేబులు సొరుగులో నుంచి యింతలావుగా వున్న పొడుగు పేజీల పుస్తకం బయిటికి తీసి 'పరిస్తితి యిట్టా వుంటే ఎట్టా యిమ్మంటావు చెప్పు' అన్నాడు.

'ఏందిది?' అన్నాను, అర్థంగాక.

'దూదేకుల సంగంవోళ్లు తెచ్చిచ్చిన పుస్తకం. మనూర్లో ఎంతమంది దూదేకులోళ్లున్నారో సర్వే చేసి వాళ్లే తయారుచేసిచ్చిన లిస్టు యిది. ఈ లిస్టులో వున్నోళ్ల బిడ్డలకే సర్టిఫికేట్లు యివ్వాలంట. అట్టాగాకుండా దూదేకుల పేరుతో సాయిబులగ్గానిస్తే ఎంక్వయిరీ చేసి గొడవ పెట్టేస్తామన్నారు' అన్నాడు.

నేను హాజీ తట్టు, హాజీ నా తట్టు చూసుకున్నాము ఆ మాటలకి- ఏమీ పాలుబోక.

అప్పుడు సాలేహా కొడుకే నాకొక సలహా యిస్తా 'ఒక పని చెయ్యి. యీ లిస్టుల వున్న ఎవుర్నో ఒక దూదేకులాయన్ని పట్టుకొని- యీ పిల్లోడు మా దూదేకుల పిల్లోడే అని రాయించుకొనిరా. కాయితం యిస్తా' అన్నాడు.

కాయితం రాయించుకోవడం తర్వాతి సంగతిగానీ ముందు ఏ దూదేకులాయిన్ని పట్టుకోవాలో అర్థంగాలా. పుట్టి పెరిగి యిన్నేళ్లు కావస్తా వున్నా మా వూళ్లో ఒక్క దూదేకులాయనతో కూడా నాకు స్నేహం లేదు. నాకనేకాదు మా నాయినకిగానీ మా బందువులలో ఎవ్వునికీగాదీ దూదేకులోళ్లతో సంబంధాలు లేవు. పెట్టుకోము కూడా. పండగ నమాజులకి వాళ్లు టోపీలు పెట్టుకొని వచ్చినా మేము పోయి 'ఈద్ ముబారక్'లు చెప్పి వాటేసుకోము. యింక వాళ్లకీ మాకూ మధ్య పెళ్లిసంబందాల్లాంటివైతే ఊహించను కూడా ఊహించలేము.

వాళ్లు మాత్రం సాయిబులు కాదా అంటే బంగారం లాంటి సాయిబులే. అయినాగానీ అదేందో మేమే పెద్ద పుడింగి సాయిబులమన్నట్టుగా పోజులు పెడతా వుంటాము. మేము పోజులు పెట్టేకొద్దీ వాళ్లకు కడుపుకాలి యింకాస్త దూరం పోతా వుంటారు.

యిదంతా ఆలోచించుకున్నాక యింకీ పని జరగదని చెప్పి ఉసూరుమంటా వచ్చేస్తా

వుంటే సాలేహ్ కొడుకు నా బుజం మీద చెయ్యేసి సైకిలు దాకా వచ్చి చెప్పినాడు.

''నువ్వనే కాదు బచ్చే! రోజూ యిట్టా చాలామంది సాయిబుల పిలకాయలు నా దగ్గరికి వస్తా వుంటారు. అందరూ బీదోళ్లే అయినా అందరికీ దూదేకుల స్టర్టిఫికేటు యివ్వలేంకదా. ఎట్టా నువు పేపరాఫీసులో పని చేస్తా వున్నావు కాబట్టి రేపు హైద్రాబాదెళ్లి 'సాయిబులందర్నీ దూదేకులోళ్లనన్నా చెయ్యండి. దూదేకులోళ్లందర్నీ సాయిబులుగానన్నా చెయ్యండిగాని ఏదో ఒక సావుసచ్చి మావోళ్లందరికీ స్టర్టిపికేట్లు వచ్చేటట్టు మాత్రం చెయ్యండి' అని రాసి పార్యాన్నాకు. అనేక చూసుకుందాం'' అన్నాడు నవ్వతా.

నాకు నవ్వురాలా. మా నాయిన మీద బలే కోపం వచ్చింది. ఇప్పుడింత డిమాండింగు, యింత పొడుగు ప్రొసీజరూ వున్న దూదేకుల స్టర్టిపికేటును ఉత్త పుణ్యానికి యిస్తానని కాళ్ల దగ్గరికి వచ్చిన చాన్సుని కాదనేసినాడే అని మండిపోయింది.

ఎందుకనంటే- నేను ఏడో కిలాసులో వుండగా ఒక రోజు మీసాల సుబ్బరాజయివోరు మా నాయిన్ని పిలిపించినాడు ఇస్కూలికి.

ఏమి పనోలే అంటా వచ్చిన మా నాయిన్ని టీ యిచ్చి కూచోపెట్టి 'కరీం భాయ్! రాను రాను బిడ్డల్ని సదివించడం బలే కష్టమైపోతుంది నీ బోటోళ్లకి. యిప్పుడు మీవోడు సెవన్తుకు వచ్చినాడు. యిదే చాన్సు. 'దూదేకుల' అని రాయించేద్దాము. రేపు సదువుకునేదానికైనా ఉద్యోగం సంపాదించుకునేదానికైనా చానా ఆసరాగా వుంటుందా స్టర్టిపికేటు. మనంగాని యిప్పుడు రాయించకపోతే హైకిలాసుల్లో రాయించడం చానా కష్టం. నా మాట విను' అన్నాడు మీసాల సుబ్బరాజయివోరు.

ఆ మాటలకి పరాయోళ్ల సొమ్ము దొంగిలిస్తున్నంత బాద పడిపోయినాడు మా నాయిన. పొద్దుగూకులా కష్టం చేయమంటే చేస్తాడుగానీ యిట్టాంటి పనులు మా నాయినకు చేతగావు. అంతెందుకా? మా నాయిన కరెంటు పనోడు కదా. మా యింట్లో తిరిగే కరెంటు మీటరు సంగతి ఆయనకి తెలిసినంతగా యింకెవ్వరికీ తెలియదుకదా. అయినాగాని దానిని వెనక్కి తిప్పే పనిగాని, ఆగిపోయేట్టు చేసే పనిగాని పెట్టుకునేవాడు కాదు. కరెంటు బిల్లు యింత పొడుగు వచ్చినప్పుడల్లా మా అమ్మ లబలబమని నోరు కొట్టుకొని 'మీటరుని వెనక్కి తిప్పరాదా?' అని చెప్పినాసరే 'అట్టాంటి నామర్దా పనులు నా దగ్గర ఎత్తబాక' అనేసి మా అమ్మ నోరు మూయించేసేవాడు.

అట్టాంటి మనిషి ఆయన కడుపున పుట్టినోడికి 'దూదేకుల' అని రాయిస్తాడా? సుబ్బరాజయివోరు ఎంత చెప్పినా వినకుండా- 'వద్దులే భాయ్! వాళ్ల స్టర్టిపికేటు

మనమెందుకు రాయించుకోవాల? వాళ్లకు దక్కాల్సింది మనమెందుకు తినాల?' అన్నాడు.

ఆమాటన్నాక- అంతలోనే మళ్లా గర్వంగా, నవాబులాగా మొకం పెట్టి 'మేము కూటికి పేదోళ్లమేగాని కులానికి నవాబులమే భాయ్. మీరెంత చెప్పినా దూదేకులోళ్లమని రాయించుకోము' అన్నాడు, బుజాలు పొంగిస్తా.

మా నాయినట్టా కులానికి నవాబుననుకోవడం వల్ల నేను ఫీజులు కట్టి, యింక కట్టలాక డిగ్రీతోటే చదువు ఆపేసినాను. హాజీగాడు నవాబునని అనుకోకపోయినా ఫీజులు కట్టి, యింక కట్టలాక ఇంటరుతోటే ఆపేయడానికి రెడీగా వున్నాడు.